క్లుప్తంగా

ఆచంట ఎస్సైగా వెంకట రమణ



పెనుగొండ: ఆచంట ఎస్సైగా కట్టా వెంకట రమణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మొగల్తూరు నుంచి ఆచంటకు బదిలీపై వచ్చారు. మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కృషి చేస్తానన్నారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్సై వెంకట రమణకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఎంపీడీవో అనుపమ బదిలీ



బదిలీ అయిన ఎంపీడీవో అనుపమను సత్కరిస్తున్న ఉద్యోగులు

పాలకొల్లు అర్బన్: తూర్పు గోదావరి జిల్లా తాళ్లరేవు ఎంపీడీవోగా బదిలీ అయిన బి.అనుపమను సోమవారం మండల పరిషత్ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సత్కరించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అనుపమ బదిలీపై పాలకొల్లు వచ్చారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంలోనూ, పాలకొల్లు మండలంలో ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అనుపమ ప్రత్యేక కృషి చేశారని పలువురు ఉద్యోగులు ప్రశంసించారు. ఈవోపీఆర్‌డీ కేఎం వైభవతి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కొర్రా గోవిందరాజు, పంచాయతీ కార్యదర్శులు ముచ్చర్ల నాగేశ్వర రావు (చిన్నా), లింగం సత్యనారాయణ, ఓదూరి సూర్యప్రకాశరావు, డీఎస్ పద్మాజీ రావు, మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు ఎంపీడీవోను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి



జాతీయ జెండాలతో నిర్వహించిన బైక్ ర్యాలీ

యలమంచిలి: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి ఇంటిపై జాతీయజెండా ఎగురవేయాలని కోరుతూ సోమవారం దొడ్డిపట్ల గ్రామంలో పాఠశాల విద్యార్థులు, బీజేపీ నాయకులు కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం దొడ్డిపట్ల నుంచి అడవిపాలెం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు నామన శ్రీనివాస్, కుక్కల కేశవరావు, వినుకొండ రాంబాబు, కడలి గణేష్, గుబ్బల శాంతరాజు, దొంగ నరసింహకుమార్, దివి ప్రకాష్, యర్రంశెట్టి కృష్ణ భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి



ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

పెనుగొండ: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లకు నాలుగు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, సత్వరం వేతన బకాయిలు చెల్లించాలని సీఐటీయూ అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం పెనుగొండ తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దారు అనిత కుమారికి వినతి పత్రం సమర్పించారు. పాఠశాలలు ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ వేతనాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. కార్మికులకు 2020 నుంచి వేతనాల పెరుగుదల లేదని తెలిపారు. మండలంలో 66 మంది ఆయాలు పని చేస్తున్నారని తెలిపారు. వీరికి జీతాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సీఐటీయూ నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, షేక్ పాదుషా, మాదాసు నాగేశ్వరరావుల పాల్గొన్నారు.

యలమంచిలి ఎంపీడీవో రిలీవ్

యలమంచిలి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కృష్ణా జిల్లా నుంచి యలమంచిలి ఎంపీడీవోగా బదిలీపై వచ్చిన పి.శ్రీనివాసరావుకు మళ్లీ తిరిగి కృష్ణా జిల్లాకు బదిలీ కావడంతో సోమవారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. కొత్త ఎంపీడీవోగా ఇంకా ఎవరూ రాకపోవడంతో ఈవోపీఆర్డీ షేక్ అమీర్ షరీఫ్‌కు ఇన్‌చార్జి ఎంపీడీవో బాధ్యతలు అప్పగించారు.

పొంగుతున్న డ్రెయిన్

నరసాపురం: పట్టణంలోని రాయిపేటలో ఆంధ్రా బ్యాంక్ రోడ్డులో ఉన్న డ్రెయిన్ మురుగుపారడం లేదు. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. అటుగా వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు డ్రెయిన్స్‌లో పూడిక తీత పనులు చేపట్టారు. అయితే ఈ పనులు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయి. చాలా వరకూ ప్రధాన ప్రాంతాల్లో మాత్రం అలాగే వదిలేశారు. ఆంధ్రా బ్యాంక్ రోడ్డులో పలు విద్యా సంస్థలు కూడా ఉన్నాయి. ఇటుగా వెళ్లే వారు ముక్కు మూసుకుని వెళ్లే పరిస్థితి. డ్రెయిన్‌ను శుభ్రం చేసి సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



పెనుగొండలో జాతిపిత గాంధీజీ, డాక్టర్ అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న సర్పంచ్‌లు, ఎంపీడీవో

పెనుగొండ: ఆచంట మండల అభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆచంట ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి అన్నారు. సోమవారం ఆచంట ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. పంచాయతీ విధులు, పారిశుద్ధ్య నిర్వహణ, వర్మి కంపోస్టు నిర్వహణ, మార్కెటింగ్ స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యం, పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీ వంటి అంశాలపై అవగాహన కల్పించారన్నారు. వీటి ద్వారా పంచాయతీల అభ్యున్నతికి పాటుపడాలన్నారు. వైస్ ఎంపీపీ తాళం శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఎంపీడీవో పి.నరసింహ ప్రసాద్, విస్తరణాధికారి టి.మూర్తి బాబు, పి.చంద్ర శేఖరరావు, రవి, కె.శివ కుమార్, పి.నాగిరెడ్డి పాల్గొన్నారు.

మండలాన్ని అగ్ర స్థానంలో నిలపాలి

పెనుగొండ మండలాన్ని అగ్ర స్థానంలో నిలపడానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో పి.శ్రీనివాస దొర అన్నారు. సోమవారం పెనుగొండ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ తరగతుల సమావేశంలో పాల్గొన్నారు. శిక్షణాంశాలను వివరించారు. జ్యోతి ప్రజ్వలన చేసి జాతిపిత మహాత్మాగాంధీ, భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాలులర్పించారు. మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి, సర్పంచ్‌లు నక్కా శ్యామలాసోనీ శాస్త్రి, కడలి బేబీ అన్నపూర్ణ, పిల్లి అనంత లక్ష్మీ, చింతపల్లి గనిరాజు, ఈవో పీఆర్డీ ఎవెంకట రెడ్డి పాల్గొన్నారు.

పెనుమంట్రలో మొక్కుబడిగా శిక్షణ

పెనుమంట్ర: ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్‌లకు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల పాటు పెనుమంట్ర ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే శిక్షణ కార్యక్రమం తొలి రోజైన సోమవారం మొక్కుబడిగా సాగింది. మండలంలోని 18 మంది గ్రామ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు ఈ నెల 12 నుంచి 14 వరకు ఆయా గ్రామాల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, వీధి దీపాలు, పారిశుద్ధ్యం, తాగునీరు, గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి ప్రణాళికలు తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే ఉదయం కొద్దిమంది సర్పంచ్‌లు మాత్రమే హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మధ్యాహ్న సమయంలో భోజన విరామం అనంతరం ఒక్క సర్పంచ్ మినహా మిగిలిన సర్పంచ్‌లు శిక్షణకు గైర్హాజరుకావడంతో కార్యదర్శులతోనే మొక్కుబడిగా శిక్షణ కార్యక్రమాన్ని పూర్తిచేసి, అధికారులు తొలిరోజు మొక్కుబడిగా ముగించారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

పాలకొల్లు అర్బన్: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై సర్పంచ్‌లు, కార్యదర్శులు ప్రతీ రోజూ సమీక్షించుకోవాలని ఎంపీడీవో బి.అనుపమ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచ్‌లకు, కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ తరగతులను ఎంపీడీవో అనుపమ ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ పంచాయతీకి జనాభా దామాషా ప్రకారం విడుదల చేసే 15వ ఆర్థిక సంఘం నిధుల వ్యయంపై ప్రణాళిక బద్ధంగా ఖర్చు చేసుకోవాలన్నారు. వీధిలైట్ల నిర్వహణ, మంచినీటి సరఫరాకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే రికార్డులను కూడా సక్రమంగా నిర్వహించాలన్నారు. ఆ రికార్డులను భద్రపరచడంలో కూడా కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ పంచాయతీలోనూ తడి చెత్త, పొడి చెత్త సేకరణకు ప్రత్యేక చర్యలు తీసుకొని సేంద్రీయ ఎరువులను తయారు చేసుకొని ఆదాయ మార్గాలను పెంచుకోవాలని అనుపమ కోరారు. ఈవోపీఆర్‌డీ కేఎం వైభవతి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కొర్రా గోవిందరాజు, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు గుమ్మాపు పెద్దిరాజు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు డీఎస్ పద్మాజీరావు, ముచ్చర్ల చిన్నా, లింగం సత్యనారాయణ, ఓదూరి సూర్య ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.



పెనుమంట్ర: మొక్కుబడిగా సాగుతున్న సర్పంచ్, కార్యదర్శుల శిక్షణ



ఆచంటలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ సూర్యకుమారి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీవో బి.అనుపమ

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

పెనుగొండ: 35 ఏళ్లుగా వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన బాల్య మిత్ర సేవా ట్రస్టు అందిస్తున్న సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. సోమవారం బాల్య మిత్రా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో 10 మంది అనాథ విద్యార్థులకు రూ.5 వేలు వంతున ఆర్థిక సహాయం అందించారు. అదే విధంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

బీటలు వారిన రహదారి



రోడ్డు మధ్యన గాడితో ప్రమాదకరంగా మారిన బాడవ ప్రధాన రహదారి

యలమంచిలి: సిమెంట్ రోడ్ల నిర్మాణం ప్రారంభమైన 90వ దశకంలో యలమంచిలి మండలంలో నిర్మించిన మొదటి సిమెంట్ రోడ్డు బాడవ రోడ్డు. సుమారు నాలుగు దశాబ్దాలు గడచిన ఆ రోడ్డు ఇంకా వాడుకలోనే ఉంది. ప్రతీ ఏడాది బాడవ గ్రామానికి వరదలు వస్తాయి. ఈ విధంగా ఈ రోడ్డు నిర్మించిన దగ్గరి నుంచి ప్రతీ ఏడాది వరద ముంపునకు గురవుతూనే ఉంది. ఈ నేపథ్యంలో రోడ్డు జాయింట్ సుమారు మూడు అంగుళాల మేర విడిపోయి, అంతే లోతున గొయ్యి పడింది. బైక్ మీద ప్రయాణించే వారికి ఈ గొయ్యి ప్రాణ సంకటంగా మారింది. ఆదమరుపుగా ఉండి గొయ్యిలో బండి చక్రం పడితే బండి అదుపు తప్పి పడిపోతున్నారు. దీంతో ఈ రోడ్డు మీద ప్రయాణం నరకప్రాయంగా మారింది. అధికారులు వెంటనే స్పందించి గోతిలో కనీసం తారు పోసి ప్రమాదాలను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వృద్ధుల సమస్యలపై అవగాహన సదస్సు



రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కొండా నిర్మల, తదితరులు

పాలకొల్లు సెంట్రల్: నేటి సమాజంలో వృద్ధులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు కొండా నిర్మల అన్నారు. సోమవారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నేటి సమాజంలో వృద్ధుల సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా నిర్మల మాట్లాడుతూ వృద్ధులను సంతోషంగా ఉంచాలన్నారు. మన చుట్టు పక్కల ఎవరైనా వృద్ధులను ఇబ్బందులకు గురి చేసేవారు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. వారికి తగిన న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ శాస్త్ర పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి, బాల కోటయ్య, సెక్రటరీ మూర్తి, సీనియర్ సిటిజన్ శర్మ, జూలియ, తదితరులు పాల్గొన్నారు.

నారుమడి ఎక్కువ రోజులు ఉంచొద్దు

మొగల్తూరు: నారుమడులు వేసిన తరువాత 25 రోజులుమించి ఆకు ఉంచొద్దని వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ సూచించారు. ఈ నెల 10న మండలంలో సుమారు 21.05 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. దీంతో ఇప్పుడిప్పుడే ఆకుమడుల్లో నిలిచిన నీరు లాగుతుంది అనుకునే సమయంలో మరోసారి కురిసిన వర్షానికి తిరిగి ఆకుమడుల్లో నీరు చేరింది. దీంతో వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ సోమవారం మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి మునిగిన ఆకుమడులను, వరినాట్లు వేసిన చేలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ఈ ఏడాది సార్వా సాగు ఆలస్యమైందని, ముందుగా వరినాట్లు వేసిన చేలు, ఆకుమడులు ముంపునకు గురయ్యాయన్నారు. మండలంలో సుమారు 1398 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేయగా ఇప్పటి వరకు కేవలం 320 ఎకరాల్లో మాత్రమే నాట్లు వేశామన్నారు. నారుమడులు కూడా రెండోసారి మురపునకు గురయ్యాయని ఆకు వయస్సు 25 రోజులు మించకుండా చూడాలని రైతులకు సూచించారు. ఎక్కువ రోజులు ఉన్న ఆకును నాటితే దిగుబడిపై ప్రభావం చూపుతుందన్నారు. రైతులు తాము వేసుకున్న పంటకు సంబంధించి సాగు హక్కు పత్రం తప్పనిసరిగా పొందాలన్నారు. దీంతో ప్రభుత్వం అందించే పథకాలకు అర్హులవుతారన్నారు. ఆయన వెంట రైతు సేవా కేంద్రం సిబ్బంది, తదితరులు ఉన్నారు.

కళాశాలలో హర్ ఘర్ తిరంగా



హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్న ఏఎస్ఎస్ఎం కళాశాల విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర ప్రభుత్వం, ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ ఆదేశాల ప్రకారం ఈ నెల 9 నుంచి 15 వరకూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. సోమవారం 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని కళాశాలలో హర్ ఘర్ తిరంగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గ్రంథ పాలకుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, అధ్యాపకుడు జీడీ శ్రీనివాస్, వీసీహెచ్ రమేష్, పి.శ్రీనివాస్, ఎం.రామకృష్ణ, వి.విజయలక్ష్మి, జి.మహేష్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో

పట్టణ బీజేవైఎం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్ మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పట్టణ పుర వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. అలాగే మంగళవారం పట్టణంలో విద్యార్థులు, కూటమి నేతలతో స్థానిక గాంధీ బొమ్మల సెంటర్ నుంచి జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

అసంబద్ధంగా ఉపాధ్యాయుల పని సర్దుబాటు



ఎంఈవోకు వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నరసాపురం రూరల్: ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ చాలా అసంబద్ధతతో కూడుకున్నదని యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎం.మార్కండేయులు అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ హుటాహుటిన సోమవారం చేపట్టిన ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ కౌన్సిలింగ్ విధానాన్ని బహిష్కరించారు. ఉపాధ్యాయ సంఘాలు చెప్పిన ఏ అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా నిర్వహించనున్న కౌన్సిలింగ్‌ను రాష్ట్ర, జిల్లా ఫ్యాప్టో సంఘాల పిలుపు మేరకు బాయ్‌కట్ చేశామన్నారు. నరసాపురం ఎంఈవో పిల్లి పుష్పరాజ్యం, జాన్ ప్రభాకర్ లను కలిసి మెమోరాండం అందజేశారు. వెను వెంటనే విద్యాశాఖ ఈ నెల 17 నాటికి కౌన్సిలింగ్‌ను వాయిదా వేసినట్లు ప్రకటించిదన్నారు. ఇప్పటికైనా ఉపాధ్యాయ సంఘాలు చెప్పిన అంశాలను పరిగణనలోకి తీసుకొని సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి కృష్ణ కుమారి, కె.బాలా కుమారి, ఎస్.చంద్ర కుమార్, కె.శ్రీనివాస్, అజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

89వ ఏఐఎస్ఎఫ్ వ్యవస్థాపక దినోత్సవం



ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: దేశం కోసం ప్రాణత్యాగం చేసి ఉద్యమాన్ని నిర్మించిన ఏకైక విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) అని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు పోడూరు ప్రతాప్‌రాజు అన్నారు. సోమవారం స్థానిక డీఎన్నార్ కళాశాలలో 89 ఏఐఎస్ఎఫ్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ రాజు మాట్లాడుతూ 1936 ఆగష్టు 12 ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో నగరంలో బెనారస్ విశ్వవిద్యాలయంలో ఉరికొయ్యలను ముద్దాడి దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన భగత్ సింగ్ స్ఫూర్తిగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందన్నారు. నాటి నుంచి నేటి వరకూ దేశాన్ని ప్రగతి పథం వైపు నడిపించడంలో శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందన్నారు. ఏఐఎస్ఎఫ్ సభ్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న మహిళా సంరక్షణ అధికారిణి స్వప్నశ్రీ

అత్తిలి: బాల్యవివాహాలు చేయడం వల్ల అనేక అనర్థాలు జరుగుతాయని మహిళా సంరక్షణ అధికారిణి ఎం స్వప్నశ్రీ అన్నారు. సోమవారం అత్తిలి మండలం బల్లిపాడు ప్రాథమిక పాఠశాలలో బేటీ పడావో-బేటీబచావో కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాలు నిరోధక చట్టంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా స్వప్నశ్రీ మాట్లాడుతూ బాలికల చదువు భావితరాలకు వెలుగు అని అన్నారు. బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యానేరమన్నారు. బాల్యవివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమం అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం శివసత్యవతి, డి నర్సవేణి, బి నిర్మల, సీహెచ్‌వీ రామలలిత పాల్గొన్నారు.

హిందువులపై దాడులకు నిరసనగా రుద్రహోమం



క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్ర హోమం చేస్తున్న పురోహితులు

పాలకొల్లు సెంట్రల్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను పట్టణ గాయత్రి స్మార్త పురోహిత సంఘం అధ్యక్షుడు తనికెళ్ల శ్రీనివాస రావు తీవ్రంగా ఖండించారు. సోమవారం స్థానిక క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో పట్టణ గాయత్రి స్మార్త పురోహిత సంఘం ఆధ్వర్యంలో అభిషేకాలు, రుద్రహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఈ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నటుల తెలిపారు. బంగ్లాదేశ్‌లో అనేక విపత్తులు వచ్చినప్పుడు భారతదేశం మోదీ నాయకత్వంలో ఎన్నో విధాలుగా సహాయ సహకారాలు అందించారన్నారు. అలాగే బంగ్లాదేశ్‌లో ఉన్న ఇస్కాన్ టెంపుల్ నుంచి ఎంతో సహకారం అందిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మద్దూరి సూరిబాబు, ఈరంకి కాశి, రవీంద్ర, ఫణి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లపై విద్యార్థుల ర్యాలీ



ఓపెన్ స్కూల్‌లో చేరాలని కోరుతూ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పెనుమంట్ర: పాఠశాలల్లో చదువుకునే అవకాశం లేని బాలబాలికలకు వయోజనులకు విద్యను అందించడానికి ప్రభుత్వం ఓపెన్ స్కూల్ విధానాన్ని ప్రవేశ పెట్టిందని బడి మధ్యలో మానేసిన ఎస్ఎస్‌సీ, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు 14 ఏళ్లు నిండి చదివి, వ్రాయ గలిగిన పరిజ్ఞానం ఉంటే ఈ కోర్సుల్లో జాయిన్ అవ్వొచ్చని సోమవారం పెనుమంట్ర జేడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు వీధుల్లో ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఇది మహిళలకు పలు రకాల వ్యాపారాలు చిరు ఉద్యోగాలలో ఉన్న వారికి ఎస్ఎస్‌సీ, ఇంటర్‌మీడియట్ కోర్సులలో జాయిన్ అవ్వడానికి సువర్ణ అవకాశమని, ఈ ర్యాలీలో ప్రచారం చేశారు. ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో ఈ దూర విద్యా విధానాన్ని పెనుమంట్ర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశామని వారు పేర్కొన్నారు.

డ్రగ్స్ వాడకంతో కుటుంబం విచ్ఛిన్నం



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: డ్రగ్స్ వాడడం వలన మనిషి అనారోగ్యాలకు గురి కావడమే కాకుండా కుటుంబం కూడా విచ్ఛిన్నమయ్యే ప్రమాదం ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీ ప్రసాద్ అన్నారు. సోమవారం విద్యార్థులచే డ్రగ్స్ దుర్వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా భవానీ ప్రసాద్ మాట్లాడుతూ చెడు వ్యసనాలకు విద్యార్థులు ఎంత దూరంగా ఉంటే భవిష్యత్‌లో అంత ఉన్నత శిఖరాలను అధిరోహించగలరన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పిల్లల నడవడికపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అప్పుడే పిల్లలను చెడు వ్యసనాలకు గురి కాకుండా చూసుకోగలమని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతిజ్ఞలో పాల్గొన్నారు.

వన మల్లిఖార్జునుడికి జలాభిషేకం



వన మల్లిఖార్జునుడికి జలాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

మొగల్తూరు: వడయార్‌పేటలో వేంచేసియున్న శ్రీ భ్రమరాంబ సమేత వన మల్లిఖార్జునుడికి సోమవారం జలాభిషేకం నిర్వహించారు. ఉత్తర భారత దేశంలో నిర్వహించినట్లుగానే దక్షిణాదిలోనూ మన ప్రాంతంలో నిర్వహించాలనే ఆలోచనతో ప్రప్రథమంగా స్వామి వారికి అభిషేకం చేశారు. గ్రామంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు 25 కావిళ్లతో తీసుకొచ్చిన జలాన్ని స్వామి వారికి జలాభిషేకం నిర్వహించారు. శ్రావణ మాసంలో వచ్చే 5 సోమవారాలు స్వామి వారికి కావిడి జలాభిషేకం నిర్వహించాలని ఆలయ నిర్వాహకులు నిర్ణయించారు. దీంట్లో భాగంగా శ్రావణ మాసం రెండో సోమవారం కూడా జలాభిషేకం ఘనంగా నిర్వహించారు. శ్రీ శైలం తరువాత స్వామి వారి శివలింగాన్ని తాకే అవకాశం ఉండటంతో గ్రామంలోని భక్తులు భారీగా తరలి వచ్చి జలాభిషేకంలో పాల్గొన్నారు.

పనిలో నైపుణ్యానికి శిక్షణ దోహదం

నరసాపురం రూరల్: పనిలో నైపుణ్యానికి శిక్షణ దోహదపడుతుందని ఎంపీపీ మైలాబత్తుల సోని అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజులు నిర్వహించనున్న సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, ఎంపీడీవో కేవీ భద్రరావు మాట్లాడుతూ సర్పంచ్‌లకు కార్యదర్శులకు ఉమ్మడిగా శిక్షణ ఇవ్వడం మంచి పరిణామమన్నారు. చెత్త నుంచి సంపద వృద్ధి, వీధి దీపాల నిర్వహణ, పంచాయతీ జమా ఖర్చులు తదితర అంశాలపై మాట్లాడారు. డివిజన్ రీసోర్స్ పర్సన్లుగా విశ్వనాథం, ట్రైనర్లు పిప్పళ్ల సాయిరాం, యడ్లపల్లి కృష్ణ, కేఐఎస్ రాజు వ్యవహరించారు. గాలి కాలుష్యం, నీటి కాలుష్యం, ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే అనర్థాల గురించి వీడియో చిత్రాలను ఎల్ఈడీ ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించి వివరించారు. నరసాపురం, మొగల్తూరు ఈవోపీఆర్డీలు కె.ఆంజనేయ శర్మ, ఎం.నవీన్ కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో 28 గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.